సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 11 । మార్చి । 2023

I



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శాశ్వత నిత్య సుదర్శన హోమానికి కిళాంబి రాఘవాచారి, లక్ష్మి దంపతులు (న్యూఢిల్లీ) శుక్రవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



అన్నదమ్ములే నిందితులు

గత నెల 24న రాయవరం మండలం మాచవరం గ్రామ సమీపంలోని పంట పొలాల్లో జరిగిన హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. - IIలో

తండ్రీకొడుకుల దుర్మరణం



సామర్లకోట పై ఓవర్ బ్రిడ్జి కూడలిలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటనపై ఆగ్రహం చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు, ఎఫ్‌సీఐ జట్టు కూలీలు ఆందోళన నిర్వహించారు. - IIలో

న్యూస్‌రీల్

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు వివిధ అంశాలపై అమరావతి నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, వేసవి నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా అవసరమైన మందులను సిద్ధంగా ఉంచామన్నారు. ఉపాధి హామీ పనులను ఉదయం 11 గంటలకు ముగించి తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించేలా రీషెడ్యూల్ చేశామని, పని ప్రదేశాలలో షెడ్స్, తాగునీరు అందించేలా చర్యలు చేపట్టామని వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద మార్చి నెలలో ఇప్పటి వరకూ 4,949 సాధారణ ఓపీ చూశారని తెలిపారు. రక్తపోటు కేసులు 76,534, సుగర్ 59,581, గర్భిణులు 20,850, బాలింతలు 2,666, రక్తహీనత కేసులు 248 మందిని గుర్తించి, వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. సాధారణ జబ్బులు, జ్వరాలు, దగ్గు వంటి వాటితో బాధ పడుతున్న వారిని గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేపట్టామన్నారు. ఆరో విడత జగనన్న తోడు కింద పట్టణ పరిధిలో 4,369, గ్రామీణ ప్రాంతాల్లో 19,078 మంది లబ్ధిదారులను లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9,478 మంది వలంటీర్లకు గాను 9,324 మంది పని చేస్తున్నారని, ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో 1,112 సమస్యలు గుర్తించామని, వీటిలో 1,031 పనులకు పరిపాలన ఆమోదం ఇచ్చామని, మిగిలినవి పరిశీలన దశలో ఉన్నాయని కలెక్టర్ మాధవీలత వివరించారు.

చైల్డ్ సైకాలజీలో పీజీ డిప్లొమా



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఆచార్య ప్రసాదరాజు తదితరులు

రాజానగరం: చైల్డ్ అండ్ అడోల్సెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్‌లో పీజీ డిప్లొమా కోర్సును ప్రారంభించనున్నామని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. సంబంధిత బ్రోచర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజీ ఆధ్వర్యాన ఏడాది కాలపరిమితితో కూడిన ఈ కోర్సులో ప్రవేశానికి ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7093 00 8477 నంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, కోర్సు కో ఆర్డినేటర్ నక్కిన నారాయణ, పడాల రాజశేఖర్, సీహెచ్ భవాని పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

రాజమహేంద్రవరం సిటీ: వేసవిలో వినియోగదారులకు జవాబుదారీగా ఉంటూ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోష రావు ఆదేశించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని డివిజన్ల అధికారులతో రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయంలో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవిలో విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యుత్ చౌర్యం, లైన్ల నవీకరణ, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు తదితర అంశాలపై సమీక్షించారు. ఈపీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ, జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పనకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పనులు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి, అధికారులు తిలక్ కుమార్, నక్కపల్లి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి డెల్టాకు నీటి విడుదల

సీలేరు (అల్లూరి సీతారామరాజు): గోదావరి డెల్టా భూములకు సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లోని డొంకరాయి జలాశయం నుంచి రోజుకు 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఎస్ఈ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. జలవనరుల శాఖ అధికారుల ఆదేశాలతో గత ఏడాది డిసెంబర్ చివరి వారం నుంచి డెల్టా అవసరం మేరకు ఎప్పటికప్పుడు నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. డెల్టా భూములకు మరింత నీరు కావాల్సి ఉన్నందున శుక్రవారం నీటి విడుదల ఆరంభించామని, వారం రోజుల వరకూ ఇది కొనసాగుతుందని తెలిపారు. సీలేరు కాంప్లెక్స్ నుంచి ఇప్పటి వరకూ ఆరు టీఎంసీల జలాలు విడుదల చేశామని పేర్కొన్నారు. ఇది కాకుండా పొల్లూరు విద్యుత్ కేంద్రంలో రోజు వారీ ఉత్పత్తి అనంతరం మరో 4,300 క్యూసెక్కులు కూడా గోదావరిలో చేరుతుందని తెలిపారు. సీలేరు, డొంకరాయి, పొల్లూరు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి ఆశాజనకంగా ఉందని ఎస్ఈ తెలిపారు.

రేపటి తల్లికి ఉపకారి

- మాతా శిశుమరణాల తగ్గింపే లక్ష్యంగా 'కిల్కారీ' సేవలు
- మొబైల్ ద్వారా గర్భిణులు, బాలింతలకు సూచనలు
- తెలుగు సహా ఐదు భాషల్లో వాయిస్ మెసేజ్‌లు



గ్రామ సచివాలయంలో గర్భిణికి వైద్యసేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: మాతా శిశు మరణాల తగ్గింపే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయి. గర్భిణులు, బాలింతల్లో అవగాహనతోనే సత్ఫలితాలు సాధించగలమన్న నమ్మకంతో వినూత్న విధానాలు అవలంబిస్తున్నారు. మరణాలకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయాలంటే గర్భిణులుగా నమోదైనప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకూ.. వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీస్తూ అవసరమైన సేవలు అందించాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా సరైన సమయానికి అవసరమైన జాగ్రత్తలు, మందులు తీసుకునేలా ఫోన్ కాల్స్‌తో గర్భిణిని అప్రమత్తం చేస్తారు. కిల్కారీ పోర్టల్ ద్వారా దేశంలోని ఐదు భాషల్లో ఈ వాయిస్ మెసేజ్‌లు వస్తాయి. కొద్ది కాలంగా తెలుగులో కూడా సూచనలు అందిస్తున్నారు.

ప్రతి వారం ఆడియో సందేశం

'అన్నయ్యా, వదినమ్మా నమస్కారం. బాగున్నారా? కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిల్కారీ మొబైల్ సేవ నుంచి వైద్యుడిని మాట్లాడుతున్నా.. మీరు ఎలా ఉన్నారు? ఏం చేస్తున్నారు? ఆరోగ్యం ఎలా ఉంది? పాపాయి బాగుందా? బిడ్డ ఆరోగ్య సంరక్షణకు మీరు ఆచరించేందుకు సులువుగా ఉండే విషయాలు చెబుతా వినండి.. మనమంతా కలిసి మీ బిడ్డకు మెరుగైన భవిష్యత్తు అందిద్దాం' అంటూ గర్భిణులకు నాలుగో నెల నుంచే వారానికొకటి చొప్పున బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకూ 72 వారాల పాటు ఆడియో సందేశాలు ఇస్తారు.

బిడ్డ పుట్టిన తర్వాత..

'మీకు తెలుసా? పుట్టిన గంటలోగానే బిడ్డకు పాలు తాగించాలి. తల్లి పాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం. బిడ్డకు కావాల్సినవన్నీ ఈ పాలల్లో ఉంటాయి' అంటు బిడ్డ పుట్టిన తరువాత ఆడియో మెసేజ్ పంపిస్తున్నారు. కిల్కారీలో నమోదైన ప్రతి గర్భిణి/బాలింత మొబైల్ ఫోన్‌కు 01133278000 నంబరు నుంచి ఈ ఆడియో మెసేజ్‌లు వస్తాయి. మొదటిసారి కాల్ లిఫ్ట్ చేయకపోతే మరో రెండుసార్లు కాల్స్ వస్తాయి. ఆండ్రాయిడ్ ఫోన్‌తో పాటు కీప్యాడ్ ఫోన్ ఉన్నా ఈ సేవలు పొందవచ్చు.

ఎంతో ప్రయోజనం

గర్భిణికి సుఖప్రసవంతో పాటు బిడ్డకు జన్మనిచ్చాక కూడా ఆ శిశువు ఆరోగ్యంగా ఎదిగేందుకు ఈ కిల్కారీ ఫోన్ కాల్స్ తోడ్పడుతున్నాయి. పిల్లలు విరేచనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వయస్సుకు తగిన బరువు ఉండేందుకు ఏం చేయాలి, పిల్లలకు ఇవ్వాల్సిన ఆహారం ఏమిటి వంటి సూచనలు, సలహాలు ఇందులో ఉంటాయి. ఈ విధానాన్ని 2016లోనే తీసుకొచ్చినా ఇటీవలే బాగా ప్రాచుర్యం కల్పించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 23,798 మంది గర్భిణులు, 20,477 మంది బాలింతలకు కిల్కారీ సేవలు అందిస్తున్నారు. ఈ సేవలపై పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లోని సిబ్బందికి, క్షేత్రస్థాయిలో సేవలందించే ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

మారుమూల ప్రాంతాల్లో సైతం



కిల్కారీ పోర్టల్ వల్ల మారుమూల ప్రాంతాల్లోని సైతం గర్భిణులు, బాలింతలకు అవగాహన పెరుగుతుంది. బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకూ సేవలు అందుతాయి. ఈ సూచనలు పాటించడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. మాతా శిశు మరణాలను చాలా వరకూ తగ్గించవచ్చు.

- డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి

నాలుగో నెల నుంచి సూచనలు



గర్భం దాల్చిన నాలుగో నెల నుంచి ఫోన్ కాల్స్ వస్తున్నాయి. మూడు నెలలు పూర్తయ్యాక సమయానికి నిద్ర అవసరమని, నిద్రపోయేటప్పుడు ఎడమ వైపు పడుకుంటే బిడ్డకు, తల్లికి మంచిదని తెలిసింది. నాలుగో నెలలో పెరగాల్సిన బరువు, రక్తప్రసరణ సక్రమంగా ఉండేలా చూసుకోవడం వంటి జాగ్రత్తలు తెలిశాయి.

- బాబు అఖిల, శాటిలైట్ సిటీ

రబీ ధాన్యం కొనుగోలుకు సమాయత్తం

- 329 ఆర్‌బీకేల్లో కొనుగోలు కేంద్రాలు
- 4,55,845 మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం
- కలెక్టర్ మాధవీలత

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): రబీలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు సమన్వయ శాఖలు సమాయత్తం కావాలని కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. రబీ ధాన్యం కొనుగోలుపై మార్కెటింగ్, పౌర సరఫరాలు, వ్యవసాయ, రవాణా, మార్కెటింగ్, సహకార అధికారులు, మిల్లర్లతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2022–23 రబీ సీజన్‌లో 4,55,845 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, ఈ మేరకు జిల్లాలో 329 రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) ధాన్యం కొనుగోలు కేంద్రాలు (పీపీసీ) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మార్చి 20న షెడ్యూలుకు, ఏప్రిల్ 1 నుంచి కొనుగోలుకు అధికారులు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. ఇందుకు సంబంధించి టెక్నికల్ అసిస్టెంట్లు, వీఏఓలు, ఇతర సిబ్బందిని ఆయా పీపీసీల్లో నియమించాలన్నారు. ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకుండా పక్కా ప్రణాళికతో గన్నీ బ్యాగులు, హమాలీలు, రవాణా వాహనాలను ముందుగానే సిద్ధం చేయాలని మాధవీలత సూచించారు. 80 లక్షల గోనె సంచులు అవసరమవుతాయని అంచనా వేశామన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని రాజానగరం, అనపర్తి, రంగంపేట, బిక్కవోలు; కొవ్వూరు డివిజన్‌లోని కొవ్వూరు, చాగల్లు మండలాల్లో వరి కోతలు ముందుగానే ప్రారంభమవుతాయని తెలిపారు. ధాన్యం తేమ శాతాన్ని నిర్ధారించేందుకు జిల్లాలోని 19 తహసీల్దార్ కార్యాలయాల్లో యంత్రాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, జిల్లా సరఫరా అధికారి పి.ప్రసాదరావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎ.కుమార్, ఆర్‌టీఓ కేఎస్ఎంవీ కృష్ణారావు, మార్కెటింగ్ అధికారి ఎం.సునీల్ వినయ్ పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి రుణాలు

- కలెక్టర్ మాధవీలత
- వార్షిక రుణ ప్రణాళికపై బ్యాంకర్లతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): వార్షిక రుణ ప్రణాళికలో ప్రాధాన్య రంగాలకు లక్ష్యానికి మించి రుణాలు అందజేశారని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. వార్షిక రుణ ప్రణాళిక అమలులో ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో బ్యాంకర్లు సాధించిన ప్రగతిపై కలెక్టరేట్ సమావేశం మందిరంలో శుక్రవారం జరిగిన సమీక్షకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.6,398 కోట్ల రుణాలివ్వాలన్నది లక్ష్యం కాగా, రూ.7,431 కోట్లు ఇచ్చారని తెలిపారు. అలాగే, సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు రుణ లక్ష్యం రూ.1,914 కోట్లు కాగా రూ.2,152 కోట్ల మేర అందజేశారని పేర్కొన్నారు. ఇతర ప్రాధాన్య రంగాలైన విద్య, గృహ నిర్మాణాలకు రూ.693 కోట్ల మేర రుణాలు ఇవ్వాల్సి ఉండగా, రూ.327 కోట్లు ఇచ్చారన్నారు. సామాజికాభివృద్ధి సాధనకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం మరో 20 రోజుల్లో ముగుస్తున్నందున ప్రభుత్వ అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. జిల్లాలో ఎంపిక చేసిన మహిళా పారిశ్రామికవేత్తలకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని, వీరందరికీ సూక్ష్మ పరిశ్రమల స్థాపనకు ఈ నెలాఖరుకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. బ్యాంకర్ల కమిటీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఎ.హరిబాబు మాట్లాడుతూ, అన్ని రంగాల్లో లక్ష్య సాధనకు బ్యాంకర్లు సిద్ధంగా ఉన్నారని అన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ, వార్షిక రుణ ప్రణాళిక అమలు తీరును అంశాల వారీగా వివరించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జిల్లా ప్రతినిధి పి.నాగప్రవీణ్ మాట్లాడుతూ, రుణాల మంజూరులో అలసత్వం చూపకుండా అధికార యంత్రాంగానికి, లీడ్ బ్యాంకు మేనేజర్‌కు సహకరించాలని బ్యాంకర్లకు సూచించారు. ఈ సమావేశంలో నాబార్డ్ డీడీఎం వై.సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఖైదీల సృజనాత్మకత అభినందనీయం



సెంట్రల్ జైలులో జరిగిన మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మహిళా ఖైదీల సృజనాత్మకత, ఆలోచన విధానం, నిజాయితీ, నిబద్ధత అభినందనీయమని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక మహిళా కేంద్ర కారాగారంలో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'క్షణికావేశంలో చేసిన తప్పు వల్లనే ఇక్కడ ఉన్నారు తప్ప, బయట ఉన్న మాకంటే మిన్నగా మీలో ప్రతిభా పాటవాలు ఉన్నాయి' అని అన్నారు. నీటిని సద్వినియోగం చేసుకోవాలనే అంశంతో ప్రదర్శించిన కథాంశం ఆకట్టుకుందన్నారు. జైలులో జీవితాన్ని సద్వినియోగం చేసుకుని సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. మహిళా ప్రత్యేక కారాగారం పర్యవేక్షకురాలు సీహెచ్ వసంత కుమారి మాట్లాడుతూ, మహిళల కోసం ప్రత్యేక కారాగారాన్ని 1994లో ఏర్పాటు చేశారని అన్నారు. క్షణికావేశంలో తప్పు చేసిన వారిలో పరివర్తన వచ్చే అవకాశం ఇక్కడ ఉందని చెప్పారు. వారిలో ఆత్మవిశ్వాసం, నమ్మకం పెంచేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రజని, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వసుంధర, డీపీఎల్ఓ వీణాదేవి పాల్గొన్నారు.

ఊపిరున్నంత కాలం జగనన్నతోనే..

- వచ్చే నెలలో 'జయహో జగనన్న' యువ సమ్మేళనం
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి గణేష్. చిత్రంలో చందన నాగేశ్వర్, ఆనందకుమార్ తదితరులు


రాజమహేంద్రవరం సిటీ: తన ఊపిరి ఉన్నంత కాలం జగనన్నతోనే ఉంటానని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో మరోసారి సీఎంను చేసేందుకు, వైఎస్సార్ సీపీని మరింతగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. స్థానిక వీవీ గార్డెన్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన తండ్రి, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ఏకలవ్య శిష్యునిగా ఉన్నారన్నారు. 'నాకు నాయకుడు రాజశేఖరరెడ్డి అయితే, మీకు నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి' అని మరణించే ముందు తన తండ్రి చెప్పారని, ఆయన మాటకు కట్టుబడి జగనన్నకు అండగా ఉంటున్నామని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను వంద శాతం నెరవేర్చేలా పని చేస్తానన్నారు. గతంలో చంద్రబాబు కుటుంబానికో ఉద్యోగం ఇస్తామని, లేకుంటే రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి యువతను నిలువునా మోసం చేశారని దుయ్యబట్టారు. దీనికి భిన్నంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చారని గుర్తు చేశారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు సాధించి యువతకు మరింతగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఆయన స్ఫూర్తితో 5 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో పార్టీని తిరుగులేని శక్తిగా ముందుకు తీసుకువెళతానని చెప్పారు. నగరంలో పార్టీ మరింత దూకుడుగా ముందుకు వెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ పెద్దలందరితో సంప్రదించి ఏప్రిల్ 3, 4, 5 తేదీల్లో రాజమహేంద్రవరంలో 'జయహో జగనన్న' పేరిట యువ సమ్మేళనం నిర్వహిస్తామని గణేష్ ప్రకటించారు. దీనికి ఐదు జిల్లాల నుంచి యువతను పెద్ద సంఖ్యలో సమీకరిస్తామన్నారు. తనకు పదవి ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి, మిథున్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థి విభాగం జోనల్ ఇన్‌చార్జి నీలి వీర ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థి విభాగాన్ని గ్రామస్థాయిలో బలోపేతం చేయడం ద్వారా జగనన్న సంక్షేమ సందేశాన్ని ప్రతి ఇంటికి తీసుకువెళ్తామని చెప్పారు. విలేకర్ల సమావేశంలో రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ యువ నాయకులు దాడిశెట్టి శ్రీనివాస్, పినిపే శ్రీకాంత్, మిండగుదిటి శిరీష్, తోట పృథ్వీరాజు, పిల్లి సూర్యప్రకాష్, చిట్టూరి ప్రవీణ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్‌ను పలువురు గజమాలలతో సత్కరించారు.

అమ్మవారికి.. అందాల మందిరం

- తలుపులమ్మ తల్లికి కృష్ణశిలతో ఆలయం
- చెక్కుచెదరని రీతిలో పునర్నిర్మాణం
- చకచకా ఏర్పాట్లు.. 3 నెలల్లోగా పూర్తి



తలుపులమ్మ తల్లి ఆలయాన్ని పునర్నిర్మించనున్న పవిత్ర స్థలం



నూతన ఆలయ నిర్మాణానికి తీసుకువచ్చిన కృష్ణశిలలు



లోవలో కొలువైన తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి.. తలుపులమ్మ తల్లికి అందాల మందిరం రూపుదిద్దుకోనుంది. ఇందుకు సంబంధించిన చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. లోవ దేవస్థానంలో స్వయంభువుగా వెలసిన అమ్మవారి దర్శనానికి ఏటా లక్షలాది మంది వస్తూంటారు. పర్వదినాల్లో అయితే లోవ ప్రాంగణం, రహదారి కిక్కిరిసిపోతూంటాయి. ప్రస్తుతం అమ్మవారి గర్భాలయం గుహలో ఆరడుగుల ద్వారంతో ఉంది. ఈ ద్వారం చిన్నదిగా ఉండటంతో వస్తున్న భక్తుల్లో 40 నుంచి 50 శాతం మంది మాత్రమే అమ్మవారిని దర్శించుకోగలుగుతున్నారు. దీనిని గుర్తించిన అధికారులు ఆలయాన్ని సువిశాలమైన ద్వారంతో పునర్నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. అమ్మవారి విగ్రహం చెక్కు చెదరకుండా.. భక్తులు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా దర్శించేందుకు వీలుగా ద్వారాన్ని విస్తరిస్తారు. ఈ పనులు పూర్తయితే నూరు శాతం భక్తులు అమ్మవారిని కన్నులారా దర్శించుకునే అవకాశం కలగనుంది.

చురుకుగా..

ప్రస్తుతం ఆలయ పునర్నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్నాయి. దశాబ్దాల పాటు చెక్కు చెదరని రీతిలో నూతన ఆలయాన్ని కృష్ణశిలలతో నిర్మిస్తున్నారు. ఇందుకు అవసరమైన కృష్ణశిలలను పల్నాడు జిల్లా కోటప్పకొండ ప్రాంతం నుంచి లోవ దేవస్థానానికి తరలిస్తున్నారు. కట్టడం పనులు ఈ నెలాఖరుకు ప్రారంభించి, మూడు నెలల్లో పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.1.82 కోట్లతో అమ్మవారికి నూతన ఆలయం, రూ.కోటితో మహామండపం నిర్మించనున్నారు. నూతన ఆలయ నిర్మాణంలో ఐదారు వందల మెట్రిక్ టన్నుల కృష్ణశిలలను వినియోగించనున్నారు. ఈ శిలలను మనుషులతో కొండ పైకి తరలించడం కష్టమవడంతో పనులు ఆలస్యమవుతున్నాయి. దీంతో 150 అడుగుల ఎత్తు వరకూ రాళ్లను తరలించేందుకు భారీ క్రేన్‌ను రప్పించారు. ఈ క్రేన్‌ను నిర్దిష్ట ప్రదేశంలో ఏర్పాటు చేసి, నూతన ఆలయానికి అనువుగా కృష్ణశిలలను నేరుగా అమర్చనున్నారు. సమాంతరంగా మహామండప నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరుతున్నాయి. ఇప్పటికే దీని నిర్మాణానికి పిల్లర్ల పనులు జరుగుతున్నాయి. నూతన ఆలయ నిర్మాణానికి అనువుగా స్వయంభువుగా వెలసిన తలుపులమ్మ అమ్మవారిని కదల్చకుండనే.. పూర్వం నిర్మించిన ఆలయాన్ని పూర్తిగా తొలగించారు. దర్శనాలు నిలిపివేసినప్పటికీ అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు, నిత్యపూజలు కొనసాగిస్తున్నారు. గత జనవరి నెలాఖరులో అమ్మవారికి బాలాలయం నిర్మించారు. అప్పటి నుంచీ ఇక్కడే భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నారు. తలుపులమ్మ అమ్మవారిని ఏటా పది లక్షల మంది భక్తులు దర్శించుకుంటున్నారన్నది అధికారుల అంచనా. హుండీలు, వ్యాపార లైసెన్సులు, ఇతర రుసుముల ద్వారా రూ.6 కోట్ల ఆదాయం సమకూరుతుంది.



పునర్నిర్మించనున్న ఆలయం నమూనా

మే నెలాఖరులోగా..



ఆలయ పునర్నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేస్తాం. మే నెలాఖరులోగా ఆలయాన్ని ప్రారంభిస్తాం. నూతన ఆలయంలోనే అమ్మవారి ఆషాఢ మాసోత్సవాలు జరుపుతాం. దేవస్థానానికి వచ్చే భక్తులందరికీ దర్శనాలు కల్పిస్తాం. అమ్మవారి పవిత్రతను కాపాడుతూనే ఆలయ పునర్నిర్మాణం, మహామండప నిర్మాణ పనులను స్థపతుల సూచనలు, సలహాలతో అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నాం. నూతనాలయానికి వృద్ధులు, చిన్నారులు వెళ్లడానికి వీలుగా లిఫ్ట్ లేదా ఎస్కలేటర్ ఏర్పాటు చేస్తాం. ఆలయ అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవంపై దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఏప్రిల్ నెలాఖరులో అధికారులతో సమీక్షించనున్నారు.

- పెన్మెత్స విశ్వనాథరాజు, కార్యనిర్వహణాధికారి, లోవ దేవస్థానం

క్లుప్తంగా

'ప్రగతి'కి జాతీయ స్థాయిలో 2వ ర్యాంక్

- ఎడ్యుస్కిల్స్ వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లో ఘనత
- కళాశాల ఛైర్మన్ కృష్ణారావు



ఎడ్యుస్కిల్ వర్చువల్ ఇంటర్న్‌షిప్



డాక్టర్ పి.కృష్ణారావు, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఇ) వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లో ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. ఈ మేరకు కళాశాల ఛైర్మన్ పి.కృష్ణారావు శుక్రవారం తెలిపారు. దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల నుంచి 155 ఉన్నత విద్యాసంస్థల నుంచి 59,500 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా ప్రగతి విద్యార్థులు 2,150 మంది పాల్గొన్నారన్నారు. నాలుగు విశిష్ట విభాగాల్లో ఇంటర్న్‌షిప్ పూర్తిచేయడం ద్వారా ఈ ఘనత సాధించామని తెలిపారు. ఏడబ్ల్యుఎస్ (అమెజాన్ వెబ్ సర్వీస్) అకాడమీ విభాగంలో 575, డేటా ఎనలిటిక్స్ ప్రాసెస్ ఆటోమేషన్ ఇంటర్న్‌షిప్ అండర్ అట్రిక్స్ 261, మైనింగ్ ప్రాసెస్ అండర్ సెలొనిస్ 71, సైబర్ సెక్యూరిటీ అండర్ లో ఆల్టో 455, రోబొటిక్స్ ప్రాసెస్ ఆటోమేషన్ అండ్ బ్లూ ప్రిజమ్ 369, నెట్‌వర్కింగ్, నెట్‌వర్క్ క్లౌడ్‌లలో 419 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. విద్యార్థులను కళాశాల మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఎంవీ హరినాథబాబు, డైరెక్టర్ శంభుప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్ అభినందించారు.

విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడి మృతి



రాంబాబు మృతదేహం

ప్రత్తిపాడు రూరల్: విద్యుత్ షాక్‌తో శుక్రవారం భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. మండలంలోని వాకపల్లి గ్రామానికి చెందిన కురందాసు రాంబాబు (30), గింజాల వీరనారాయణ భవన నిర్మాణ పనుల నిమిత్తం పోతులూరు వచ్చారు. ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ఒక్కసారిగా 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలివారు షాక్‌కు గురయ్యారు. వారిలో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందగా గింజాల వీరనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పదోగతి ఎలా ఉండంటే..

- నేడు టెన్త్ విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక సమావేశం
- పర్యవేక్షించనున్న జిల్లా విద్యాశాఖ అధికారులు

రాయవరం: వచ్చే నెల మూడో తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. ఏపీ సమగ్ర శిక్షా అధికారులు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతిని వివరిస్తారు. ఇప్పటికే పాఠశాల పేరెంట్స్ కమిటీ ప్రతి నెలా సమావేశాలు నిర్వహిస్తోంది. ఆత్మ విశ్వాసంతో విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు తల్లిదండ్రులకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయడంలో తల్లిదండ్రుల పాత్ర, వారి బాధ్యతలు, కుటుంబ సభ్యుల సహకారాన్ని వివరించనున్నారు. సమావేశాలకు అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యేలా హెచ్‌ఎం/ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకోవాలి. ఉత్తమ ఫలితాలను రాబట్టేందుకు ఈ సమావేశాలు దోహద పడాలన్నది ఏపీ సమగ్ర శిక్షా లక్ష్యం. పేరెంట్స్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి, ఈ నెల 15వ తేదీలోగా ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాల్సి ఉంది.

హెచ్‌ఎం/ఉపాధ్యాయులకు సూచనలు

- ఇప్పటి వరకు విద్యార్థులు రాసిన పరీక్షల ఫలితాలు, విద్యార్థి స్థాయిని తల్లిదండ్రులకు వివరించాలి.
- వివిధ సబ్జెక్టుల్లో అధిక మార్కులు సాధించే అంశాలు, సోషల్‌లో మ్యాప్ పాయింటింగ్, సైన్స్‌లో చిత్రపటాలు, ప్రయోగాలు, లాంగ్వేజెస్‌లో లెటర్ రైటింగ్, గ్రామర్ టిప్స్ తదితర అంశాలపై ఫోకస్ చేయాలి.
- విద్యార్థులు స్టడీ అవర్స్‌కు హాజరయ్యేలా చూడడం, మోడల్ ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేసేలా చూడడం.
- పరీక్షల భయం పోగొట్టేందుకు కష్టమైన టాపిక్స్‌లో విద్యార్థులను సంసిద్ధులను చేయాలి.
- విద్యార్థుల ప్రగతిని పరిశీలన చేయాలే తప్ప, వారిపై ఒత్తిడి తీసుకురాకూడదు. అవసరమైన సహకారం అందించాలి.
- పరీక్షలు ముగిసే వరకు సంబంధిత ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులను పరిశీలన చేస్తుండాలి.
- విద్యార్థులకు వారి స్థాయిలకు అనుగుణంగా ఉపాధ్యాయులు మార్గదర్శకం చేస్తుండాలి.
- ఆరు పేపర్ల విధానంపై అవగాహన కల్పించాలి.
- ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించాలి.
- రోజూ 6–7 గంటల పాటు నిద్ర అవసరమని చెప్పాలి. టీవీ, మొబైల్ ఫోన్స్, సోషల్ మీడియాకు దూరంగా ఉండేలా విద్యార్థులను మోటివేట్ చేయాలి.



జిల్లాలో పరిస్థితి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 531 ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 69,290 మంది రెగ్యులర్ విద్యార్థులు పది పరీక్షలకు హాజరవుతున్నారు.

పది రెగ్యులర్ విద్యార్థులు ఇలా..

జిల్లా	బాలురు	బాలికలు	మొత్తం
తూర్పుగోదావరి	11,230	11,509	22,739
కాకినాడ	13,647	13,820	7,467
కోనసీమ	9,806	9,278	19,084

సమావేశాలు తప్పనిసరి



పది పరీక్షలు సమీపిస్తున్నందున ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో తప్పనిసరిగా పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించి, నివేదికలను ఉన్నతాధికారులకు పంపించాలి. విద్యార్థుల విద్యా స్థాయిపై తల్లిదండ్రులతో చర్చించాలి. పరీక్షలకు 23 రోజులు మాత్రమే గడువు ఉంది. ఉపాధ్యాయులతో పాటుగా, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

తండ్రీకొడుకుల దుర్మరణం

- మోపెడ్‌ను ఢీకొన్న అపెక్స్ ఫ్యాక్టరీ బస్సు
- ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై కుటుంబ సభ్యులు, బంధువుల నిరసన
- రెండు గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్
- ఫ్యాక్టరీ యాజమాన్యం హామీతో ఆందోళన విరమణ



మంగబ్బాయి (పాత చిత్రం)



సత్తిబాబు (పాత చిత్రం)



బంధువుల బైఠాయింపుతో ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్

సామర్లకోట: స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జి కూడలిలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు మృతిచెందారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం పుప్పాల మంగబ్బాయి (62) స్థానిక సత్యనారాయణపురంలోని ఎఫ్‌సీఐలో ఎగుమతి, దిగుమతి పర్మినెంట్ కూలీగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేశాడు. అతని పెద్ద కుమారుడు సత్తిబాబు (41) పెద్దాపురంలోని ఒక ప్రైవేటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఇద్దరూ కలసి మోపెడ్‌పై సత్యనారాయణపురం నుంచి కాకినాడ వెళుతున్నారు. కాకినాడ నుంచి వస్తున్న అపెక్స్ రొయ్యల ఫ్యాక్టరీకి చెందిన బస్సు వేగంగా వచ్చి ఢీ కొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గరగారావు కొన ఊపిరితో ఉన్న ఇద్దరిని అంబులెన్సులో స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరేటప్పటికి ఇద్దరూ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, ఎఫ్‌సీఐ జట్టు కూలీలు ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైకి చేరుకున్నారు. దాంతో ఘటనా ప్రదేశంలో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. ఘటనా ప్రదేశంలోనే ఇద్దరూ చనిపోయారని, పోలీసులు మృతదేహాలను ఆస్పత్రికి తరలించారని బాధితులు ఆరోపించారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలిలో బైఠాయించడంతో ట్రాఫిక్ రెండు గంటల పాటు స్తంభించింది. విషయం తెలుసుకున్న అపెక్స్ ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధులు ఘటనా ప్రదేశానికి చేరుకొని మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సీఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



ఘటనా స్థలిలో తీవ్రంగా గాయపడ్డ మంగబ్బాయి, సత్తిబాబు



రోదిస్తున్న సత్తిబాబు కుమార్తె వెంకటలక్ష్మి, బంధువులు

రెక్కాడితేనే గాని డొక్కాడని కుటుంబం..

డెక్కాడితే గాని డొక్కాడని కుటుంబంలో తండ్రీ కొడుకులు మృతి చెందడంతో సత్యనారాయణపురంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పుప్పాల సత్తిబాబుకు ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడు సత్తిబాబు తండ్రి వద్దనే ఉంటున్నాడు. మిగిలిన ఇద్దరు వేరు వేరుగా ఉంటున్నారు. సత్తిబాబుకు భార్య సత్యవేణి, 18 సంవత్సరాల కుమార్తె వెంకటలక్ష్మి ఉన్నారు. కుమార్తెకు పెళ్లి కావలసి ఉంది. సత్తిబాబు మృతి చెందడంతో భార్య, కుమార్తెలు భోరున విలపించారు. మండే ఎండలో రోడ్డుపై వారు రోదించిన తీరు స్థానికుల హృదయాలను కలచి వేసింది. యాజమాన్యం బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే శనివారం మృతదేహాలతో ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తామని ఎఫ్‌సీఐ కార్మిక సంఘ నాయకుడు చల్లా కొండ హెచ్చరించారు.

రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం, ఉద్యోగం

మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో మృతుని బంధువులతో ఫ్యాక్టరీ ప్రతినిధులు నష్టపరిహారం విషయమపై చర్చించారు. మృతుల కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పున చెల్లించడంతో పాటు వారి కుటుంబాల్లో ఇద్దరికి ఉద్యోగాలు ఇవ్వడానికి అంగీకరించారు. బస్సుకు వచ్చే ప్రమాద ఇన్సూరెన్సు సొమ్ము బాధిత కుటుంబానికి ఇచ్చేలా ఒప్పుకున్నారు. చర్చలలో సీఐ కె.దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాల శ్రీను, కౌన్సిలర్లు, పాల్గొన్నారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏటికొప్పాక ఖ్యాతి చెక్కు చెదరదు

పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన సీవీ రాజు



సీవీ రాజును సత్కరిస్తున్న అకాడమీ అధికారులు

రాజానగరం: చైనా నుంచి వెల్లువలా వస్తున్న బొమ్మలు ఎంత పోటీ ఇస్తున్నప్పటికీ ఏటికొప్పాక బొమ్మలకు ఉన్న ఖ్యాతి ఏనాటికీ చెక్కు చెదరదని అనకాపల్లి జిల్లా ఏటికొప్పాక వన సంరక్షణ సమితి అధ్యక్షుడు సీవీ రాజు అన్నారు.

2023 సంవత్సర పద్మశ్రీ అవార్డుకు కళారంగం నుంచి ఎంపికైన నేపథ్యంలో దివాన్‌చెరువులోని ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీ ఆహ్వానించడంతో శుక్రవారం వచ్చారు. శిక్షణలో ఉన్న అటవీ అధికారులు, వన సంరక్షణ సమితుల అధ్యక్షులతో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో పాల్గొన్నారు. గత 550 ఏళ్లగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటూ బొమ్మల తయారీలో ఏటికొప్పాక ప్రత్యేకతను సంపాదించుకుందన్నారు.

కళానైపుణ్యం, సాంకేతికత, వనరులు ఒకేచోట ఉన్న గ్రామం కావడంతో ఇక్కడ పుట్టిన వారికి 12 ఏళ్ల వయసుకే బొమ్మల తయారీలో ఇంజినీర్ స్థాయి పరిజ్ఞానం అలవడుతుందన్నారు. బొమ్మల నాణ్యత, ఆకర్షణీయమైన తయారీల వల్లనే మన్‌కీ బాత్‌లో ప్రధాని ఏటికొప్పాక కళను శ్లాఘించారన్నారు. కాశీ నుంచి కన్యాకుమారి వరకు ఏటికొప్పాక బొమ్మలు లేని పుణ్యక్షేత్రం లేదనడం అతిశయోక్తి కాదని సీవీరాజు పేర్కొన్నారు.

పర్యావరణ హితంగా బొమ్మల తయారీ

ఏటికొప్పాక బొమ్మలకు ఇంతటి పేరు రావడానికి ప్రధాన కారణం అవి పర్యావరణ హితంగా ఉండటమేనని అకాడమీ డైరెక్టర్ పీఏవీ ఉదయ్‌భాస్కర్ అన్నారు. అంకుడు చెట్లను అశాస్త్రీయంగా నరికివేయడం వలన కొన్నేళ్ల కిందదట ముడిసరుకు లభ్యతలో తలెత్తిన సమస్యల పరిష్కారంలోను, బొమ్మలకు పూర్తి సహజరంగులు వాడేట్టు చేయడంలోను సీవీ రాజు కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం సీవీరాజును అకాడమీ తరఫున సత్కరించారు. సీసీఎఫ్ శ్రీశరవణన్, రంపచోడవరం డీఎఫ్‌ఓ నరేంద్ర, అకాడమీ ఏసీఎఫ్‌లు డాక్టర్ ఎన్‌వీ శివరామప్రసాద్, ఏవీ రమణమూర్తి, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదమ్ములే నిందితులు

- హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ బాలచంద్రారెడ్డి



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ శివగణేష్, ఎస్సై సురేష్

రాయవరం: గత నెల 24న రాయవరం మండలం మాచవరం గ్రామ సమీపంలో మండపేట–కాకినాడ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న పంట పొలాల్లో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్యకు దారి తీసిన పరిణామాలను, హత్యాచార వివరాలను రామచంద్రపురం డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి శుక్రవారం రాయవరం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. హతురాలు సత్యవేణి, నిందితులు నల్లమిల్లి ఉమామహేశ్వరరెడ్డి, వెంకట సత్యనారాయణరెడ్డి దేవుడు కాలనీలో నివసిస్తున్నారు. గతంలో నిందితులు సత్యవేణితో అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె పెద్దలకు తెలియజేసింది. దీన్ని మనసులో ఉంచుకున్న నిందితులు సత్యవేణి హత్యకు ప్రణాళిక రచించారు. ఎప్పటి నుంచో వేచి చూస్తున్న వీరికి గత నెల 23 రాత్రి సత్యవేణి మాచవరం వంతెన వద్ద నుంచి రాత్రి 8 గంటల ప్రాంతంలో నడుచుకుంటూ వస్తోంది. విషయాన్ని గమనించిన నిందితులు చినతలుపులమ్మ లోవకు వెళ్లే సమీపంలో ఒంటరిగా వస్తున్న సత్యవేణిని పంట దిమ్మపైకి లాక్కుని వెళ్లి నిందితులు ఇద్దరూ అత్యాచారం చేశారు. ఆపై అక్కడే లభించిన వైరును మెడకు బిగించి హత్యకు పాల్పడ్డారు. ఆమె శరీరంపై ఉన్న బంగారు వస్తువులను తీసుకుని, ఆమెను గడ్డివామిలో పెట్టి దగ్ధం చేశారు. ఇదిలా ఉంటే హత్య కేసులో తన కుమారులు ఉన్నారన్న తెలిసిన నిందితుల తల్లి పద్మ ఈ నెల 8న ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందిన విషయం విదితమే. నిందితులను శుక్రవారం పసలపూడి సమీపంలో పుంత రోడ్డులో పోలీసులు అదుపులోకి తీసుకుని, అనపర్తి జేఎఫ్‌సీఎం ముందు హాజరు పర్చారు.

తొలుత మిస్టరీగా మారిన కేసు

గత నెల 24న గుర్తుపట్టలేని విధంగా కాలిపోయిన మృతదేహం మహిళదా..పురుషునిదా అన్న సందేహం పోలీసులకు ఏర్పడింది. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిళ అదృశ్యం కేసుపై దృష్టి సారించి

ఈ పరిస్థితుల్లో హత్య జరిగిన సమీపంలోని దేవుడు కాలనీకి చెందిన కొవ్వూరి సత్యవేణి అదే రోజు నుంచి అదృశ్యమైన విషయంపై పోలీసులు దృష్టి సారించారు. ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. గ్రామంలోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన మహిళ కదలికలను గమనించారు.

హత్య కేసుగా మార్పు

పోలీసులు తొలుత 302, 201 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితులు నేరం అంగీకరించడంతో 302, 376బి, 435, 404, 201 రెడ్ విత్ 34గా సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ బాలచంద్రారెడ్డి తెలిపారు. మండపేట రూరల్ సీఐ శివగణేష్, రాయవరం ఎస్సై పీవీఎస్ఎన్ సురేష్ పాల్గొన్నారు. కేసు దర్యాప్తులో కీలకపాత్ర పోషించిన కానిస్టేబుల్స్ ఏసుకుమార్(అంగర పోలీస్ స్టేషన్), బీవీవీ సత్యనారాయణ, పి.రాజు(రాయవరం పోలీస్‌స్టేషన్), మహిళా పోలీసులు అనిత, నాగేశ్వరి(మాచవరం), కె.నాగమణి(సోమేశ్వరం), ఎస్.ధనలక్ష్మి(చెల్లూరు)లను డీఎస్పీ అభినందించారు.

ఉరివేసుకుని బాలుడి ఆత్మహత్య!



వేణుసాయి మృతదేహం

రాజమహేంద్రవరం రూరల్: ఉరివేసుకుని మూడో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటనతో శుక్రవారం రాత్రి శాటిలైట్ సిటీలో విషాదఛాయలు అలుముకున్నాయి. శాటిలైట్ సిటీ సి బ్లాక్‌కు చెందిన విభూతి భవాని వేణుసాయి(9) స్థానికంగా ఉంటున్న కోనిక్స్ గ్లోబల్ స్కూల్లో నాలుగో తరగతి చదువుతున్నాడు. తండ్రి విభూతి బాబూరావు కరోనా సమయంలో మృతి చెందడంతో తల్లి రాజేశ్వరి కళాకారిణిగా బుర్రకథలు చెబుతూ ఇద్దరు మగపిల్లలను చదివిస్తోంది. పెద్ద కుమారుడు చైతన్య టెక్నో స్కూల్లో, చిన్నకుమారుడు వేణుసాయి కోనిక్స్ గ్లోబల్ స్కూల్లో చదువుతున్నారు. రాజేశ్వరి పనినిమిత్తం రాజమహేంద్రవరం వెళ్లగా వేణుసాయి అమ్మకు ఫోన్ చేసి స్కూలు ఫీజు కట్టలేదని బస్సు ఎక్కించుకోలేదని, ఇంటికి వచ్చేశానని తెలపగా ఫీజు కట్టేస్తానని చెప్పింది. రాజేశ్వరి స్కూలుకు వెళ్లి ఫీజు చెల్లించి తిరిగి సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు వేసి ఉన్నాయి. దీంతో వెనుక నుంచి ఇంటిలోకి వెళ్లగా వేణుసాయి చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉన్నాడు. సంఘటన స్థలాన్ని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయకుమార్, సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాలెన్నో...

విద్యార్థి వేణు మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కరోనాతో తండ్రి చనిపోవడంతో వేణుసాయికి స్కూలు యాజమాన్యం ఫీజు తీసుకోకుండా కేవలం బస్సు, పుస్తకాలకు మాత్రమే ఫీజు తీసుకుంటోంది. అయితే వేణుసాయి శుక్రవారం ఉదయం స్కూలు బస్సువద్దకే రాలేదని, దగ్గరలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తే తెలుస్తుందని స్కూలు ప్రధానోపాధ్యాయిని పోలీసులు విచారణలో తెలిపింది. అంతఎత్తులో ఉన్న ఫ్యాన్‌కు విద్యార్థి ఏ విధంగా చీరకట్టి ఉరి వేసుకుంటాడన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

ఏడు వాహనాలు స్వాధీనం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో కొంతకాలంగా మోటారు సైకిళ్లను దొంగిలిస్తున్న వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు శుక్రవారం చాకచక్యంగా పట్టుకున్నారు. ఇటీవల కాలంలో తాళం వేసి ఉన్న మోటారు సైకిళ్లు మాయం అయిన ఘటనలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టూ టౌన్ సీఐ ఆ దిశగా దృష్టి సారించారు. ఈ క్రమంలో కొవ్వూరు మండలం దొమ్మేరుకు చెందిన మన్యం వెంకట హరికృష్ణపై అనుమానం వచ్చింది. అతని కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు అతనిని నగరంలోని సుబ్బాయమ్మఘాట్ వద్ద మాటు వేసి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఐదు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చెందినవి కాగా, మరొకటి త్రీటౌన్, ఇంకొకటి దేవరపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందినవి ఉన్నాయి. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ గణేష్ మాట్లాడుతూ ప్రజలు మోటార్ సైకిల్ దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మోటార్ సైకిళ్లను పార్కు చేసే సమయంలో బండికి హ్యాండ్ లాక్, డిస్క్ లాక్ తప్పనిసరిగ్గా వేసుకోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగినట్లు కనిపిస్తే వెంటనే 100, 112 పోలీసు హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేసి తెలపాలన్నారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన ఎస్సై జీవీవీ సత్యనారాయణ, కేఎం జోషి, సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్.రాజశేఖర్, కె.ప్రదీప్‌కుమార్, ఎస్.వీరబాబులను జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్.సుధీర్‌కుమార్ రెడ్డి, డీఎస్పీ శ్రీలత అభినందించారు.



పోలీసులు పట్టుకున్న మోటారు సైకిళ్ల దొంగ, స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

క్లుప్తంగా...

టీడీపీ హయాంలో రాజధాని నిధులు దుర్వినియోగం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



వెంకటగిరి(తిరుపతి జిల్లా): 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కేంద్ర ప్రభుత్వం తరఫున నరేంద్రమోదీ రూ.10 వేల కోట్లు, వెంకయ్యనాయుడు ప్రత్యేకంగా కృషి చేసి మరో రూ.2.500 కోట్ల నిధులు మంజూరు చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు తెలిపారు. అయితే ఆ నిధులను అప్పటి టీడీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేసి తాత్కాలిక భవనాలతో కాలయాపన చేసిందని విమర్శించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2007లో ప్రారంభించిన స్వర్ణముఖి–సోమశిల లింక్ కెనాల్‌ను తర్వాత వచ్చిన ప్రభుత్వాలేవీ పట్టించుకోకపోవడం సరికాదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పోలవరానికి ఇప్పటివరకు రూ.16 వేల కోట్లకుపైగా నిధులు విడుదల చేసిందని స్పష్టం చేశారు.

రాష్ట్రాలపై బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరి

సీపీఎం కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు



సాక్షి, అమరావతి: ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో వారిని ఇబ్బందులు పెట్టి దెబ్బతీసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ నిరంకుశ వైఖరి అవలంబిస్తోందని సీపీఎం కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావుతో కలిసి విజయవాడ బాలోత్సవ భవన్‌లో శుక్రవారం రాఘవులు మీడియాతో మాట్లాడారు. తప్పు చేశారనుకుంటే కవిత, సిసోడియాపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో అభ్యంతరంలేదని, కానీ బీజేపీకి వ్యతిరేకంగా గట్టిగా విమర్శలు చేస్తున్నారనే కారణంతో వేధించడం దుర్మార్గమన్నారు. బీజేపీ ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా కలిసివచ్చే శక్తులతో దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ప్రకటించారు.

టీచర్లు చైతన్యంతో ఉండాలి: చంద్రబాబు

సాక్షి, అమరావతి: టీచర్లు చైతన్యంతో ఉండాలని, 2024లో వైఎస్సార్‌సీపీ ఓటమికి ఇప్పుడు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలు నాంది కావాలని ప్రతిపక్ష నేత చంద్రబాబు పేర్కొన్నారు. సీబీఎన్ కనెక్ట్ పేరుతో కొందరు టీచర్లు, లాయర్లతో శుక్రవారం ఆయన మంగళగిరి టీడీపీ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో మాట్లాడారు. దొంగసారా కేసులో ఉన్న వ్యక్తిని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబెట్టారని విమర్శించారు. బోగస్ ఓట్లను అడ్డుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఓటు వైఎస్సార్‌సీపీకి ఎవరూ వేయవద్దని కోరారు. పట్టభద్రుల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసిన తర్వాత రెండో ప్రాధాన్య ఓటు పీడీఎఫ్ అభ్యర్థులకు వేయాలని విజ్ఞప్తి చేశారు. పీడీఎఫ్‌కు ఓటు వేసిన వారు తమ రెండవ ప్రాధాన్య ఓటును టీడీపీకి వేయాలన్నారు. ప్రజాస్వామ్యయుతంగా పనిచేసే ప్రభుత్వం వస్తే సమస్యలు తొలగిపోతాయని చెప్పారు. న్యాయవాదులకు ఆర్థిక భద్రత, ఇంటిస్థలాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవ్యవస్థ పటిష్టంగా ఉంటేనే సమాజానికి మంచిదని, ఈ ప్రభుత్వం వచ్చినతర్వాత లిటిగేషన్లు, సమస్యలు పెరిగిపోయాయని ఆయన చెప్పారు.

చేనేతను నిర్వీర్యం చేసింది చంద్రబాబే: గంజి చిరంజీవి

మంగళగిరి: చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేసింది తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబేనని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకజ్ఞానం లేని లోకేశ్ మదనపల్లిలో మాట్లాడుతూ తనను ఉద్దేశించి ఆప్కో చైర్మన్‌గా ఏం పీకాదురా అనడం బీసీలను అవమానపర్చడమేనని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్‌లకు బడుగు, బలహీనవర్గాలను అవమానపర్చడం పరిపాటిగా మారిందన్నారు. తాను పదవీబాధ్యతలు చేపట్టి 35 రోజులైందని, పురాతన చేనేత సొసైటీలను సందర్శించి వాటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నానని చెప్పారు. 40 సంవత్సరాల అనుభవం కలిగిన చంద్రబాబు చేనేతలను ఏం ఉద్ధరించాడని, వారి అభివృద్ధి కోసం ఏం పీకాడని లోకేశ్ ప్రశ్నించాలని సూచించారు.

బీజేపీకి ప్రత్యామ్నాయ శక్తిగా బీఆర్ఎస్

ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్

సాక్షి, అమరావతి: దేశంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయని, బీజేపీకి ప్రత్యామ్నాయ శక్తిగా బీఆర్ఎస్ ఆవిర్భవించిందని ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ చెప్పారు. బీజేపీ నియంతృత్వ పోకడలకు కేసీఆర్ అడ్డుకట్ట వేస్తున్నారని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ సీఎం, బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్ నేతృత్వంలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చిస్తున్నట్లు చెప్పారు. త్వరలో ఏపీలోని ప్రధాన నగరాల్లో బహిరంగ సభలు నిర్వహించేందుకు కేసీఆర్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

అవినాశ్‌పై తొందరపాటు చర్యలొద్దు..

సీబీఐకి తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి అన్ని విచారణ ఫైళ్లను, రికార్డులను న్యాయస్థానం ముందు ఉంచాలని సీబీఐ దర్యాప్తు అధికారిని హైకోర్టు ఆదేశించింది. విచారణ వివరాలను పెన్‌డ్రైవ్ లేదా హార్డ్ డిస్క్‌లో పూర్తిగా సీల్డ్ కవర్‌లో సోమవారం కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. వివేకా హత్య జరిగిన చోట లభించిన లేఖ, దానికి సంబంధించిన ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) నివేదికను కూడా సమర్పించాలని సూచించింది. అప్పటి వరకు అరెస్టు సహా ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టవద్దని దర్యాప్తు అధికారి (ఐవో)ని ఆదేశించింది. పిటిషనర్ (కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి) 14న ఉదయం 11 గంటలకు సీబీఐ ముందు హాజరు కావాలని సూచించింది. ఆయన వెంట న్యాయవాది వెళ్లొచ్చని చెప్పింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, తదుపరి విచారణను 13వ తేదీకి వాయిదా వేసింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ తనను శుక్రవారం విచారణకు హాజరు కావాలనడంపై స్టే విధించాలని కోరుతూ కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఒకవేళ విచారణ చేపట్టినా.. అదంతా ఆడియో, వీడియో రికార్డింగ్ చేసేలా సీబీఐని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, సీబీఐ తరఫున అనిల్ కొంపెల్లి వాదనలు వినిపించారు.

పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు..

'వైఎస్ వివేకా హత్య కేసులో విచారణ నిమిత్తం సీఆర్‌పీసీ 160 కింద జనవరి 24న హాజరు కావాలని ఒకరోజు ముందు కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డికి సీబీఐ నోటీసులు జారీ చేసింది. 24న ఎంపీ విచారణకు హాజరయ్యారు. తన విచారణ వీడియో, ఆడియో రికార్డింగ్ చేయాలని, విచారణ సమయంలో తన న్యాయవాదిని అనుమతించాలని కోరుతూ జనవరి 27న దర్యాప్తు అధికారులకు అవినాశ్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. దీన్ని దర్యాప్తు అధికారి అనుమతించలేదు. మళ్లీ ఫిబ్రవరి 24న హాజరు కావాలంటూ ఫిబ్రవరి 16న నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 22న కూడా అవినాశ్‌రెడ్డి వీడియో, ఆడియో రికార్డింగ్‌పై విన్నవించారు. అప్పుడు కూడా అనుమతించలేదు. మరోసారి మార్చి 10న విచారణకు రావాలని మార్చి 5న సీఆర్‌పీసీ 160 కింద మరో నోటీసు ఇచ్చారు. ఈ క్రమంలో విచారణ పారదర్శకంగా సాగడం లేదని, నిష్పక్షపాతంగా సాగేలా ఆదేశాలు ఇవ్వాలంటూ పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు' అని నిరంజన్‌రెడ్డి వివరించారు.

విచారణ పేరుతో వేధిస్తున్నారు..

'వివేకా హత్య కేసుకు సంబంధించి సీబీఐ ముందు పిటిషనర్ విచారణ ముగియగానే, మీడియా ఇష్టం వచ్చినట్లు కథనాలు రాస్తూ, ఆయన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగిస్తోంది. వాస్తవాలను పట్టించుకోవడం లేదు. అందువల్లే వీడియో, ఆడియో రికార్డు చేయాలని దర్యాప్తు అధికారులను ఎంపీ కోరారు. అయినా దర్యాప్తు అధికారి దాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. విచారణ సమయంలో పిటిషనర్ చెబుతున్న అంశాలను టైపిస్ట్ టైప్ చేస్తుండగా, దర్యాప్తు అధికారి కంప్యూటర్ మౌస్‌ను పలుమార్లు తన చేతుల్లోకి తీసుకుని కొన్ని లైన్లు తీసివేయాలంటూ టైపిస్ట్‌కు సూచించారు. కంప్యూటర్ స్క్రీన్ దర్యాప్తు అధికారికి, టైపిస్ట్‌కు మాత్రమే కనిపించేలా ఉండటంతో ఏం డెలిట్ చేస్తున్నారో పిటిషనర్ చూడలేకపోయారు. అవినాశ్‌ను విచారణ చేసే సమయంలో నలుగురైదుగురు అధికారులు ఉన్నారు. విచారణ ముగిశాక దీనికి సంబంధించిన ఓ ప్రతిని ఇవ్వమని కోరినా, దర్యాప్తు అధికారి నిరాకరించారు. నిబంధనలు అంగీకరించవని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో పిటిషనర్ వెంట న్యాయవాదిని అనుమతించేలా ఆదేశాలివ్వాలి. ఎఫ్ఐఆర్ సహా ఎక్కడా అవినాశ్ పేరు లేదు. అయినా పలుమార్లు విచారణ పేరుతో వేధిస్తున్నారు. దర్యాప్తు అధికారి.. ముందే ఓ ఊహాజనిత స్క్రిప్ట్‌ను సిద్ధం చేసుకుని, ఆ మేరకు కావాల్సిన విధంగా సాక్షులను సిద్ధం చేస్తున్నారు. అవినాశ్‌రెడ్డితోపాటు భాస్కర్‌రెడ్డిని కూడా దోషిగా చూపించే ప్రయత్నం జరుగుతోంది. దస్తగిరిని వారికి అనుకూలంగా మలచుకుని, ఆ మేరకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు' అని వాదనలు వినిపించారు.

వివేకా లేఖను తొక్కిపెట్టారు..

'వివేకా హత్య జరిగిన చోట దొరికిన లేఖను దర్యాప్తు అధికారులు తొక్కిపెడుతున్నారు. వైఎస్ వివేకా అల్లుడే ఆయన్ను హత్య చేశాడని నిందితుడు శివశంకర్‌రెడ్డి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అయితే ఈ కేసు అంశాలను మాత్రం సీబీఐ అధికారులు ఇప్పటి వరకు పట్టించుకోలేదు. సీఆర్‌పీసీలో పేర్కొన్న నిబంధనల మేరకు దర్యాప్తు పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగడం లేదు. సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా పాటించడం లేదు. ఈ నేపథ్యంలో పిటిషనర్ వీడియో, ఆడియో రికార్డు చేసేలా, న్యాయవాదిని విచారణ సమయంలో అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలి' అని పిటిషనర్ న్యాయవాది నివేదించారు.

వీడియో రికార్డింగ్‌తోనే విచారణ

వీడియో, ఆడియో రికార్డింగ్‌పై దర్యాప్తు అధికారి వివరణ తీసుకుని కోర్టుకు తెలియజేయాలని న్యాయమూర్తి.. సీబీఐ న్యాయవాదిని ఆదేశించారు. భోజన విరామం అనంతరం వాదనలు పునః ప్రారంభం కాగా, వీడియో, ఆడియో రికార్డింగ్‌లతోనే పిటిషనర్ విచారణ సాగుతోందని సీబీఐ న్యాయవాది కోర్టుకు నివేదించారు. వివేకా హత్య జరిగిన చోట దొరికిన లేఖను ఫోరెన్సిక్‌కు పంపినట్లు చెప్పారు. లేఖ విషయాన్ని 2021 జనవరి 31 నాటి అనుబంధ చార్జిషీట్‌లో పేర్కొన్నట్లు చెప్పారు. అవినాశ్‌రెడ్డి.. సాక్షినా? లేక నిందితుడా? అని న్యాయమూర్తి ప్రశ్నించగా, అవినాశ్‌రెడ్డికి సీఆర్‌పీసీ 160 కింద నోటీసులు ఇచ్చామని.. అవసరమైతే ఆయన్ను, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డిని అదుపులోకి తీసుకొనే అవకాశం ఉందని సీబీఐ న్యాయవాది చెప్పారు. ఈ సందర్భంగా కోర్టుకు హాజరైన సీబీఐ ఎస్పీ.. ఆడియో, వీడియో రికార్డుల హార్డ్‌డిస్క్, కేసు ఫైళ్లను ఇప్పుడే ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సోమవారం సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఆదేశిస్తూ న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు. కాగా, ఈ పిటిషన్‌లో వైఎస్ వివేకా కుమార్తె సునీత ఇంప్లీడ్ అయ్యారు. తన వాదనలు కూడా వినాలని కోరారు.

దస్తగిరి ఎందుకు రాలేదు?

- సీబీఐని ప్రశ్నించిన ప్రత్యేక న్యాయస్థానం
- నిందితులంతా హాజరుకావాలని చెప్పాం కదా
- తదుపరి విచారణకు అందరూ రావాలి
- విచారణ 31కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకా హత్య కేసులో ఏ–4గా ఉన్న దస్తగిరి విచారణకు ఎందుకు రాలేదని సీబీఐని ప్రత్యేక న్యాయస్థానం ప్రశ్నించింది. నిందితులంతా హాజరు కావాలని చెప్పాం కదా.. అని అసహనం వ్యక్తం చేసింది. తదుపరి విచారణకు అందరూ రావాలని ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. కేసు విచారణ సందర్భంగా చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డిలను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. మరో నిందితుడు ఎర్ర గంగిరెడ్డి కూడా హాజరయ్యారు. సీబీఐ నుంచి వచ్చిన సీల్డ్ కవర్‌లో కొన్ని పేజీలు లేవని, దీంతో దాన్ని తిరిగి పంపించామని న్యాయమూర్తి వెల్లడించారు. కేసు విచారణను వేగవంతం చేయాలని ఆదేశిస్తూ వాయిదా వేశారు. అనంతరం ముగ్గురు నిందితులను పోలీసులు మళ్లీ చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా ఎంపీ అవినాశ్‌రెడ్డి వెంట వచ్చిన 15 మంది మద్దతుదారులను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జగనన్న స్ఫూర్తితోనే చంద్రగిరి అభివృద్ధి





ఆత్మీయసభలో మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి, పక్కన చెవిరెడ్డి, రెడ్డెప్ప, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి. హాజరైన జనం

ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి

సాక్షి, తిరుపతి: తిరుపతి జిల్లా చంద్రగిరి జన సంద్రమైంది. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆత్మీయసభ పేరుతో శుక్రవారం నిర్వహించిన భారీ బహిరంగ సభకు జనం పోటెత్తారు. వేలాది యువత వెన్నంటి రాగా వందలాది బైక్‌లతో భారీర్యాలీ నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న వచ్చారా అనేంతగా ఈ సభకు భారీ స్థాయిలో ప్రజలు హాజరయ్యారని కొనియాడారు. ప్రజలకే నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శ పాలన అందిస్తున్నారన్నారు. అన్ని రాష్ట్రాలూ ఆయన పాలనను కీర్తిస్తూ, వారి రాష్ట్రాల్లోనూ జగనన్న పథకాలనే అమలు చేస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి కోసం నిరంతరం తపిస్తూ చంద్రగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్న చెవిరెడ్డి నేటి యువ రాజకీయనేతలకు దిక్సూచి వంటివారన్నారు. చెవిరెడ్డి మాట్లాడుతూ తన కుటుంబమెంతో తన ప్రజలు కూడా అంతేనన్నారు. సంపాదించే ప్రతి రూపాయిలో 75 శాతం ప్రజలకే ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజల కోసం ఖర్చు చేయడం తనకు ఓ వ్యసనమన్నారు. సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితో ఎన్నడూ లేనంత నిధులను వెచ్చించి చంద్రగిరిని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సభలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

వివేకాది ఆస్తి కోసం జరిగిన హత్య

- సీబీఐ విచారణ అనంతరం మీడియాతో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి
- హత్యా స్థలి నుంచి లెటర్‌ను మాయం చేశారు
- గుండెపోటని నేను చెప్పలేదు.. అదంతా దుష్ప్రచారం
- ఈ వాస్తవాలన్నీ వదిలి కట్టుకథ ఆధారంగా సీబీఐ దర్యాప్తు
- నేను లంచ్ మోషన్ దాఖలు చేస్తే సునీతమ్మను ఇంప్లీడ్ చేయించారు
- నేను ఏ తప్పూ చేయలేదు.. న్యాయ పోరాటానికి సిద్ధం

తప్పుదోవలో విచారణ

- ఉదయం 10.40–10.45 గంటల మధ్య ఇక్కడికి వచ్చాను. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విచారించారు. ఆ తర్వాత కోర్టు నుంచి పిలుపు వచ్చిందని దర్యాప్తు అధికారి వెళ్లారు. అయినప్పటికీ 3.30 గంటల వరకు అక్కడే కూర్చోమన్నారు. ఆపై సీబీఐ వాళ్లు వచ్చి మీరు వెళ్లండి.. మళ్లీ మేము పిలిచినప్పుడు రండని చెప్పారు.
- విచారణ మొత్తం ఆడియో, వీడియో రికార్డింగ్ కావాలని దర్యాప్తు అధికారిని మొదటి నుంచీ అడుగుతూనే ఉన్నాం. రెండోసారి ఇదే అంశాన్ని సీబీఐ డైరెక్టర్‌నే అడిగాం. ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో మూడోసారి హైకోర్టును ఆశ్రయించాం. విచారణ తప్పుదోవలో వెళ్తుండటంతో ఇలా చేయక తప్పలేదు.
- ఎంపీ టికెట్టే ఈ హత్యకు కారణం అంటే మా జిల్లా వాళ్లు నవ్వుతారు. వివేకం సర్ చనిపోయే రోజు కూడా మైదుకూరు నియోజకవర్గంలోని చాపాడు మండలంలో దాదాపు 300 ఇళ్ల డోర్ టు డోర్ ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా రఘురామిరెడ్డికి.. ఎంపీ అభ్యర్థిగా అవినాశ్‌కు ఓటెయ్యండని ప్రచారం చేశారు. కావాలంటే ఆ ఇళ్లకు వెళ్లి అడగచ్చు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని అడగచ్చు.. వాంగ్మూలం తీసుకోవచ్చు. కానీ వీళ్లు (సీబీఐ) అలా అడగరు. వాంగ్మూలం తీసుకోరు.

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకానందరెడ్డిది మర్డర్ ఫర్ గెయిన్ (ఆస్తి, సొమ్ము కోసం జరిగిన హత్య) అని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. సీబీఐ విచారణ తప్పుదోవలో వెళ్తోందని తాను మొదటి నుంచీ చెబుతూనే ఉన్నానని, అది గూగుల్ టేకౌట్ కాదు టీడీపీ టేకౌట్ అని అన్నారు. తప్పుడు సాక్ష్యాలతో అన్యాయంగా అమాయకులను ఇరికించేలా కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దర్యాప్తులో చాలా కీలక అంశాలను పక్కన పెట్టి, సిల్లీ అంశాలను తెరపైకి తెచ్చి తనకు అంటగట్టే ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. సీబీఐ విచారణకు మూడోసారి శుక్రవారం హాజరైన అనంతరం ఆయన బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

వివేకాకు రెండో పెళ్లి.. వారికి ఓ కుమారుడు..

- వివేకం సార్‌కు 2006 నుంచి ఒక యువతితో సంబంధం ఉంది. 2011లో ఆమెను పెళ్లి చేసుకున్నారు. దానికి ఇస్లాం లా ప్రకారం తన పేరు షేక్ మహ్మద్ అక్బర్‌గా మార్చుకున్నారు. పెళ్లి తర్వాత వారికి షేక్ షెహన్‌షా అనే అబ్బాయి కూడా పుట్టాడు. ఆ అబ్బాయినే వారసుడిగా ప్రకటించాలనే తపన, ఆలోచన ఆయనలో ఉండింది.
- హత్య జరగడానికి ముందు ఇల్లంతా డాక్యుమెంట్ల కోసం వెతికారని అప్రూవర్ స్టేట్‌మెంట్‌లోనే ఉంది. హత్య తర్వాత కూడా డాక్యుమెంట్లు వెరిఫై చేసుకుని వెళ్లారని స్పష్టంగా చెప్పారు. నా అనుమానం ఏమిటంటే.. నోటరైజ్డ్ విల్లు అది. ఆమె (వివేకా రెండో భార్య) పేరుతోనో, వారి అబ్బాయి పేరుతోనో ఆస్తిని ఇవ్వాలనుకోవడం.. దీన్ని అడ్డుకోవాలనుకోవడం.. ఇందులో ఆసక్తి ఎవరికి ఉందో తెలియాలి.
- నా అనుమానం ప్రకారం ఇది మర్డర్ ఫర్ గెయిన్. అందులో భాగంగానే వాళ్లు వివేకానంద రెడ్డి గారిని ఇలా చేశారు. రాబోయే రోజుల్లోనూ తప్పకుండా న్యాయ పోరాటం చేస్తా. నాకు తెలిసిన ప్రతి వాస్తవాన్నీ కోర్టుతో పాటు మీ ముందు కూడా ఉంచుతా.

ఆ లేఖ ఎందుకు దాచారు?

- నేను గాలి మాటలు మాట్లాడట్లేదు. సొంత కవిత్వాలు చెప్పట్లేదు. రికార్డుల్లో ఉన్నవి, వాటి ద్వారా తెలిసినవే మాట్లాడుతున్నా. నేను వెళ్లేలోపలే సీన్ ఆఫ్ క్రైమ్‌లో ఉన్న లేఖను సునీతమ్మ భర్త రాజశేఖర్ దాచి పెట్టారు. పీఏ కృష్ణారెడ్డికి ఆ లెటర్ విషయం కానీ, అందులో ఉన్న అంశాలు కానీ ఎవరికీ చెప్పొద్దని చెప్పారు. దీంతో పాటు సెల్‌ఫోన్‌ను దాచిపెట్టడం తప్పు కాదా? పోలీసులకు కూడా చెప్పలేదు. ఎక్కడా బాధ్యతాయుతంగా ప్రవర్తించలేదు.
- నన్ను వెళ్లమని చెప్తేనే అక్కడకు వెళ్లాను. లెటర్ ఉన్న విషయం నాకు కూడా చెప్పలేదు. ఆ లెటర్ చాలా కీలక ఆధారం. సరైన సమయానికి దాని విషయం బయటకు చెప్పకపోవడం ఈ కేసులో పెద్ద తప్పు. ఆ విషయంపై దర్యాప్తు చేయాలని కోరుతున్నా.
- నేను ఏ ఒక్కరికీ గుండెపోటని (వివేకా మరణానికి కారణం) చెప్పలేదు. కావాలంటే ఆ రోజు మార్చురీ దగ్గర, మార్చ్ 17న మాట్లాడిన మాటలు చూడండి. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం నేను అలా చెప్పినట్లు చిత్రీకరించింది. నేను బాధ్యతగా ప్రవర్తించాను. కుటుంబీకులు నాకు సమాచారం ఇచ్చాకే ఘటనా స్థలికి వెళ్లా.
- నేను చూసి బయటకు వచ్చి పోలీసులు, కుటుంబీకులు, దగ్గర బంధువులకు ఫోన్ చేసి విషయం చెప్పా. ఇవన్నీ చేయకుంటే తప్పంటారనుకున్నా. చేస్తే తప్పంటారని ఊహించలేదు. న్యాయ పరంగా పోరాటం చేస్తాం. సీబీఐ రికార్డుల్లో ఉన్న అంశాలనే తీసి కోర్టుల దృష్టికి తీసుకువెళ్తాం. మీడియా దృష్టికీ తీసుకువస్తాం. తప్పకుండా న్యాయం, నిజం గెలుస్తుంది.

ముమ్మాటికీ అది కట్టుకథే

- అప్రూవర్ థియరీనే ఓ కట్టుకథ. అందులో ప్రారంభంలోనే గొడవ ప్రస్తావన. రూ.8 కోట్ల డబ్బు రావాల్సి ఉందో, వచ్చిందో వాటి గురించి గొడవ మొదలైందని చెప్తారు. ఆ షేర్ల పంపకం మీద వివేకం సారేమో మొత్తం నాకే కావాలని అన్నట్లు, వీళ్లేమో నువ్వు సగం తీసుకో, నేను సగం తీసుకుంటా అన్నట్లు గొడవ మొదలై ఉండొచ్చంటారు.
- ఇదే సీబీఐ విచారణలో ఆ బెంగళూరు సెటిల్‌మెంట్‌కు సంబంధించి ఎనిమిది మంది సాక్షులు (ఎల్‌డబ్ల్యూ 10 నుంచి మొదలై) చాలా స్పష్టంగా చెప్పారు. ఆ సెటిల్‌మెంట్ ఫెయిల్ అయింది.. ఒక్క రూపాయి డబ్బు కూడా వచ్చే అవకాశం లేదు.. ఆ డాక్యుమెంట్లు అన్నీ ఫోర్జరీ అని చెప్పారు. అంటే రాని, వచ్చే అవకాశమే లేని డబ్బు కోసం ఎవరైనా వాగ్వాదం, గొడవ పెట్టుకుని కొట్టి చంపుకుంటారా? ఇది కట్టు కథ అని చెప్పడానికి ఇది చాలదా?

ఇది కుమ్మక్కు కాదా?

- సుప్రీంకోర్టులో మా సోదరి (సునీత) వైల్డ్ అలిగేషన్స్‌తో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌ను పూర్తిగా సమర్థిస్తూ సీబీఐ వాళ్లు కౌంటర్ అఫిడవిట్ వేస్తారు. గురువారం లంచ్ మోషన్ మూవ్ చేస్తూ రెస్పాండెంట్స్‌గా సీబీఐ డైరెక్టర్, దర్యాప్తు అధికారిని పెట్టాం. అయితే మధ్యాహ్నం 2 గంటల కల్లా సీబీఐ వారి కంటే ముందు మా సోదరి తరఫు అడ్వకేట్లు వచ్చారు. అంటే వారికి ఎవరు సమాచారం ఇచ్చారు?

అందుకే నోరు విప్పాల్సి వస్తోంది..

- కేవలం కుట్రలకు ఉపయోగపడే వాంగ్మూలాలు తప్ప నిజాలను వెల్లడించే వాంగ్మూలాలు తీసుకోవట్లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేను సరిగ్గా మద్దతు ఇవ్వలేదని ప్రచారం చేశారు. అభియోగాలు మోపారు. దాదాపు 800 పైచిలుకు ఎమ్మెల్సీ ఓటర్లు.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు ఉన్నారు. వారిని పిలిచి అడగండి. అదీ చేయరు. అప్రూవర్ థియరీ.. కట్టుకథను అడ్డం పెట్టుకుని విచారణను ఓ వ్యక్తి టార్గెట్‌గా ముందుకు తీసుకువెళ్తున్నారు.
- దీన్ని ఎవరూ హర్షించరు. దీంతో గళమెత్తడం మొదలుపెట్టాం. ఇప్పటి వరకు ఎన్ని విమర్శలు వచ్చినా, మీడియా ఎన్ని విమర్శలు చేసినా, మా సోదరి సునీతమ్మ సుప్రీంకోర్టులో, ఆంధ్ర హైకోర్టులో నాపై ఎన్ని ఆరోపణలు చేసినా మౌనంగానే ఉన్నా. ఎందుకంటే వివేకం సార్ చనిపోయారు.. ఈమె ఆయన కూతురు అని.. విచారణ జరుగుతున్నప్పుడు విచారణ సంస్థపై నమ్మకం ఉండాలని మౌనంగా ఉన్నాను.
- అయితే విచారణ తప్పుడుదోవలో వెళ్తోందని స్పష్టం కావడంతో నోరు విప్పుతున్నాను. నేను ఎటువంటి తప్పు చేయలేదని ప్రతి ఒక్కరికీ గట్టిగా చెబుతున్నా. ఈ విషయంలో ఎంత దూరమైనా వెళ్లి న్యాయ పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నా.

- సీబీఐ వాళ్లకు నోటీసు వచ్చిన వెంటనే చిటికలో సమాచారం ఇస్తున్నారు. ఆ రోజు సుప్రీంకోర్టులో కుమ్మక్కై పిటిషనర్‌కు అనుకూలంగా కౌంటర్ వేసి కోర్టులను తప్పుదోవ పట్టించారు. లంచ్ మోషన్‌లోనూ ఆమెకు సమాచారం ఇచ్చి ఇంప్లీడ్ చేయిస్తున్నారు. ఇది కుమ్మక్కు కాదా? దీని వెనుక పెద్ద కుట్రలు ఉన్నాయి. ఈ రాజకీయ కుట్రలను తప్పకుండా ఛేదిస్తాం. న్యాయ పోరాటం చేస్తాం. కంచే చేను మేస్తే.. సీబీఐ ఈ రకంగా కుమ్మక్కై విచారణ చేస్తే మాకు ఎవరు దిక్కు?


అవినాశ్‌ను ఇరికించేందుకే గూగుల్ టేకౌట్ కథ

- వివేకా హత్య కేసు దర్యాప్తుపై కడప మేయర్ సురేష్‌బాబు
- వైఎస్ అవినాశ్‌రెడ్డి వ్యక్తం చేసిన అనుమానాలను సీబీఐ పట్టించుకోలేదు
- వివేకా చనిపోయినప్పుడు మొదట చెప్పింది శివప్రకాశ్‌రెడ్డే
- ఆయన్ని ఎందుకు విచారించలేదు?



కడప కార్పొరేషన్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఇరికించేందుకే గూగుల్ టేకౌట్ కథ అల్లుతున్నారని కడప మేయర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు చెప్పారు. అందుకే తాము కోర్టును ఆశ్రయించామే తప్ప సీబీఐకి భయపడి కాదన్నారు. వైఎస్ కుటుంబం ఇలాంటి ఎన్నో కుట్రలను ఎదుర్కొని నిలబడిందన్నారు. వారిది పదిమందికి సాయం చేసే గుణమే తప్ప ద్రోహం చేసే ఆలోచన లేదన్నారు. సురేష్‌బాబు శుక్రవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సీబీఐపై ఉన్న నమ్మకం పోయేలా కేసు దర్యాప్తు సాగుతోందని అన్నారు. తాము లేవనెత్తుతున్న అనుమానాలపై దృష్టి పెట్టకుండా సీబీఐ ఒక కోణంలోనే దర్యాప్తు చేస్తోందని తెలిపారు. అవినాశ్‌రెడ్డి ఆయనకున్న అనుమానాలన్నీ లిఖితపూర్వకంగా ఇచ్చినా సీబీఐ అధికారులు పట్టించుకోలేదన్నారు. న్యాయవాది సమక్షంలో విచారించాలని, వీడియో తీయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. వివేకా చనిపోయినప్పుడు మొదట ఫోన్‌చేసి చెప్పిన శివప్రకాశ్‌రెడ్డిని ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. దస్తగిరి అప్రూవర్‌గా మారడంతో అతడిని స్వేచ్ఛగా వదిలేశారన్నారు. హత్యకు ముందు సునీల్‌యాదవ్ అవినాశ్‌రెడ్డి ఇంట్లో ఉన్నాడని చెప్పడం దారుణమన్నారు. సీబీఐ అధికారులు కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని, ఎల్లో మీడియాకు లీకులిస్తూ అభూత కల్పనలకు తావిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా సీబీఐ అధికారులు వాస్తవాలను వెలికితీసి, నిజమైన దోషులను శిక్షించాలని కోరారు.

దస్తగిరి ఎవరి పేరు చెబితే వారిని విచారిస్తున్నారు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్



వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఇరికించే కుట్ర జరుగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ చెప్పారు. ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఎవరి పేరు చెబితే వారిని చార్జిషీట్‌లో పెట్టి విచారణకు పిలవడం సరికాదన్నారు. ఎంపీ అవినాశ్‌రెడ్డికి వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాలు లేకపోయినా విచారణ పేరిట వేధించి, ఆయన రాజకీయ భవిష్యత్‌ను నాశనం చేయాలనే కుట్ర కనిపిస్తోందన్నారు. సీబీఐ విచారణను బీజేపీలోని టీడీపీ కోవర్టులు ప్రభావితం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయని చెప్పారు.

అధికారంలోకి వస్తే..

2025 జనవరికల్లా జాబ్ కేలండర్

ఉమ్మడి చిత్తూరు అభివృద్ధిపై ఎంపీ మిథున్‌రెడ్డితో చర్చకు సిద్ధం: లోకేశ్



మదనపల్లె: '2024లో గెలిచేది చంద్రబాబే.. 2025 జనవరికల్లా మొదటి జాబ్ కేలండర్ తీసుకువస్తాం. పెండింగ్ పోస్టులు భర్తీ చేస్తాం' అని టీడీపీ నేత లోకేశ్ చెప్పారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా మదనపల్లెలో యువగళం పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రాష్ట్రంలో అధికారులు చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు. చంద్రబాబు సీఎం అయితే వారందరిపైనా జ్యుడీషియల్ ఎంక్వైరీ వేసి సర్వీస్ నుంచి తప్పించి శిక్షిస్తారు. మేము కొట్టించుకునే వాళ్లం కాదు. కొట్టేవాళ్లం' అంటూ వ్యాఖ్యానించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అభివృద్ధిపై ఎంపీ మిథున్‌రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నానని, చర్చించేందుకు ఎప్పుడు వచ్చినా సిద్ధమేనన్నారు. పెద్దిరెడ్డి కుటుంబంవల్ల మదనపల్లెకు పరిశ్రమలు రావట్లేదని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే పీలేరు, మదనపల్లె, పుంగనూరు, తంబళ్లపల్లెను కలిపి జిల్లాగా ఏర్పాటు చేసి మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామని లోకేశ్ చెప్పారు. అనంతరం పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా టీడీపీలో చేరారు.

కొనసాగుతున్న హెపటైటిస్ - బీ టీకా పంపిణీ

- ఇప్పటివరకు 54,805 మంది హెచ్ఐవీ బాధితులకు తొలి డోసు
- వచ్చే వారంలో హెచ్ఐవీ హైరిస్క్ వర్గాలకు ప్రారంభం
- హైరిస్క్‌లో ఉండే 1,45,903 మందికి వ్యాక్సిన్ పంపిణీ లక్ష్యం
- హెచ్ఐవీ, హైరిస్క్ వర్గాలకు టీకా ప్రారంభించిన తొలి రాష్ట్రం ఏపీనే



సాక్షి, అమరావతి: హెపటైటిస్ వ్యాధి నియంత్రణ, నివారణ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. హెపటైటిస్–బీ బారిన పడేందుకు ఎక్కువ అవకాశాలున్న హెచ్ఐవీ బాధితులకు టీకా పంపిణీని గత నెలలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రారంభించింది. రాష్ట్రంలోని 55 యాంటి రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) కేంద్రాల్లో టీకా అందుబాటులో ఉంచింది. హెచ్ఐవీ బాధితులకు స్క్రీనింగ్ నిర్వహించి హెపటైటిస్–బీ నెగెటివ్‌గా నిర్ధారణ అయిన వారికి టీకా వేస్తున్నారు. ఇలా ఇప్పటివరకు 54,805 మందికి తొలి డోసు వేశారు. రెండో డోసు 3,002 మందికి వేశారు. వచ్చే వారంలో హెచ్ఐవీ హైరిస్క్ వర్గాలకు టీకా పంపిణీ ప్రారంభిస్తున్నారు. ఏపీ శాక్స్ హై రిస్క్ వర్గాలుగా గుర్తించిన 3,923 మంది ట్రాన్స్‌జెండర్‌లు, 1,16,616 మంది మహిళా సెక్స్ వర్కర్లు, 23,623 మంది పురుష స్వలింగ సంపర్కులు, 1,741 ఇన్‌జెక్టింగ్ డ్రగ్ యూజర్స్.. మొత్తం 1,45,903 మందికి టీకా పంపిణీ లక్ష్యం. ఈ క్రమంలో దేశంలోనే హెచ్ఐవీ బాధితులు, హైరిస్క్ వర్గాలకు టీకా ఇస్తున్న తొలి రాష్ట్రంగా ఏపీ నిలుస్తోంది. తొలి డోసు వేసుకున్న నెలకు రెండో డోసు, తరువాత రెండు నెలలకు చివరి డోసు టీకా వేస్తారు. హెపటైటిస్ నియంత్రణలో భాగంగా ఇప్పటికే వైద్యులు, వైద్య సిబ్బందికి వందశాతం టీకా పంపిణీ చేశారు. కొత్తగా విధుల్లో చేరుతున్న వారికి కూడా టీకా వేస్తున్నారు. వైద్యశాఖ అంచనాల ప్రకారం రాష్ట్రంలో 2.3 శాతం జనాభా హెపటైటిస్ – బీ, 0.3 శాతం హెపటైటిస్–సీతో బాధపడుతున్నారు. శృంగారం, రక్తమార్పిడి, సిరంజిలు, టూత్‌బ్రెష్, రేజర్లు వంటి వివిధ రూపాల్లో హెపటైటిస్–బీ ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుంది. హెచ్ఐవీ బాధితులు, హైరిస్క్ వర్గాల వారు హెపటైటిస్–బీ బారిన పడటానికి ఎక్కువ అవకాశాలుంటాయని, అందువల్ల వీరు తప్పనిసరిగా టీకా వేయించుకోవాలని రాష్ట్ర హెపటైటిస్ వ్యాధి నియంత్రణ కార్యక్రమం ప్రత్యేకాధికారి డాక్టర్ నీలిమ తెలిపారు. దగ్గరలోని ఏఆర్‌టీ కేంద్రానికి వెళ్లి స్క్రీనింగ్ చేయించుకుని టీకా వేయించుకోవాలన్నారు. హెపటైటిస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారు కుటుంబ సభ్యులకు కూడా పరీక్షలు చేయించి, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.